

# నవభూమి

## కరీంనగర్

అనుబంధం

11 మే,2025 ఆదివారం పేజిలు:5

www.epaper.navabhoomi.in


### మే 20 న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె..

# జయప్రదం చేయాలి



**గోదావరిఖని -నవభూమి:** కేంద్ర ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్ లను అమలు కోసం ప్రవేశ పెట్టిందని, దీని వల్ల దేశంలో ఉన్న కార్మిక వర్గం తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉందని ఏఐటీయూసీ కాంట్రాక్టు కార్మిక సంఘం పేర్కొంది. వెంటనే నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేసి, గతంలో కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను కొనసాగించాలని డిమాండ్ చేస్తూ మే 20 న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె ను సింగరేణి లో కూడా కాంట్రాక్టు కార్మికులు జయప్రదం చేయాలని సింగరేణి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆర్జీ వన్ బ్రాంచి అధ్యక్షులు ఎం.ఎ.గౌస్ కోరారు. భాస్కర్ రావు భవన్ లో శనివారం సమ్మె వాల్ పోస్టర్స్ ను ఆయన పలువురు నాయకుల తో కలిసి విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మూడో సారి అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్ లుగా మార్చి కార్మిక వర్గాన్ని బానిసత్వ పరిస్థితులను పెంపొందించే విధంగా ప్రయత్నం చేస్తుందని ఆయన ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ విధానాల కు వ్యతిరేకంగా గత కొన్ని సంవత్సరాలుగా కార్మిక కోడులను రద్దు చేయాలని, 44 కార్మిక చట్టాలను యధావిధిగా అమలు చేయాలని, కార్మికుల ప్రయోజనాల ను, చట్టాలను కాపాడాలని దేశ వ్యాప్తంగా 27 సార్లు సమ్మె చేసినట్లు ఆయన పేర్కొన్నారు. మే 20 న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె లో దాదాపు 50 కోట్ల మంది కార్మికులు పాల్గొన నున్నారని, దీన్ని బట్టి ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలు ఎంత దారుణంగా ఉన్నాయో అర్థమవుతుందని ఆయన అన్నారు. సింగరేణి పరిరక్షణ కోసం, కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని, వారి సంక్షేమం కోసం, ఉద్యోగ భద్రత కోసం ఈ సమ్మె లో కాంట్రాక్టు కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ నాయకులు అబ్దుల్ ఘని, సీపీఐ నగర సహాయ కార్యదర్శి తాళ్లపెల్లి మల్లయ్య, నాయకులు జైపాల్ రెడ్డి, ఆఫీస్ కార్యదర్శి తొడుపునూరి రమేశ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### గోదావరిఖనిలో భారీ జాతీయ పతాకంతో

# సంఘీభావ ర్యాలీ

**కోల్ సిటీ -నవభూమి:** పాక్ ఉగ్రవాదులను తుదముట్టించే లక్ష్యంగా చేపట్టిన ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావాలని, భారత జవానులకు భరతమాత విజయం అందించాలంటూ వీర సైనికులకు రామగుండం రిక్రియేషన్ క్లబ్ (ఆర్ఆర్సీ) మద్దతు ప్రకటించింది. గోదావరిఖనిలో భారీ జాతీయ పతాకంతో శనివారం సంఘీభావ ర్యాలీ చేపట్టింది. స్థానిక నగర పాలక సంస్థ కార్యాలయం టీ జంక్షన్ వద్ద నుంచి మొదలైన ఈ ర్యాలీలో క్లబ్ సభ్యులు జయహె భారత్ అంటూ నినాదాలతో ర్యాలీ చౌరస్తా వరకు కొనసాగింది. దారి పొడవునా దేశభక్తి పరిఢవిల్లింది. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షులు బల్మూరి అమరేందర్ మాట్లాడుతూ ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావాలని, పాక్ ఉగ్రవాదులు అణచివేసేందుకు విరోచిత పోరాటం చేస్తున్న మన భారత జవానులకు దేశ ప్రజల ఆత్మవిశ్వాసమే ఊపిరై మరింత మనోధైర్యం అందించాలని కోరారు. ప్రపంచ చిత్రపటంలో పాక్ కనిపించకుండా పోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి మంతెన శ్రీనివాస్, బుచ్చిరెడ్డి, కోశాధికారి అశోక్ రావు, ఆర్గనైజింగ్ సెక్రెటరీ జీవన్ బాబు నిట్టూరి, తిరుపతి రెడ్డి, రాజిరెడ్డి, మల్లారెడ్డి, రాజేంద్రకుమార్, రామస్వామి, సుధాకర్, ఓదెలు, శంతన్ కుమార్, శ్రీనివాస్, సత్యనారాయణ , కొత్త శ్రీనివాస్, పొలాడి శ్రీనివాస రావు, కృష్ణ, సంతోష్ రావు, రాము, సదయ్య, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



### రుణాల పంపిణీ

# లక్ష్య సాధనకు కృషి




**సిరిసిల్ల -నవభూమి:** ఎస్‌హెచ్‌జీల కు బ్యాంక్ లింకేజీ రుణాల పంపిణీలో ఉత్తమ సేవలు అందించిన జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ బాధ్యులను కలె క్టర్ సందీప్‌కుమార్ ఝా అభినందించారు. రాష్ట్ర ప్రభు త్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరా మహిళా శక్తి లక్ష్య సాధ నలో భాగంగా ఎస్‌హెచ్‌జీలకు బ్యాంక్ లింకేజీ రుణాలు ఇప్పించిన జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారులు, సిబ్బందిని సమీకృత కార్యాలయాల సముదా యంలో శుక్రవారం కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అభినం దించారు. అన్ని విభాగాల్లో ప్రథమ స్థానంలో ఉండేలా కృషి చేయాలని ఆకాంక్షించారు. అనంతరం కలెక్టర్ సం దీప్ కుమార్ ఝా మాట్లాడుతూ బ్యాంకు లింకేజి ద్వారా స్వశక్తి సంఘ సభ్యులకు రుణాలు ఇప్పించడంతో వారు ఆర్థికంగా ఎదుగుతున్నారని వివరించారు. జిల్లాలో బ్యాంకు లింకేజీ 2024-25 సంవత్సరానికి లక్ష్యం 7969 సంఘాలకు రూ. 533.73 కోట్లు కాగా 4376 సంఘాలకు రూ.542.30 కోట్లతో 102 శాతం ప్రగతి సాధించి నందున, అలాగే ఫర్ గ్రూప్ ఫైనాన్స్ రూ.12.48లక్షలు ఇవ్వటంలో రాష్ట్రంలో ప్రథమ స్థానంలో ఉండటంతో రాష్ట్రస్థాయిలో జిల్లాకు అవార్డు వచ్చిందని తెలిపారు. పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి అనసూయ సీతక్క, ప్రిన్సిపల్ సెక్రెటరీ లోకేష్ కుమార్, సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్ నుంచి డీఆర్‌డీవో, అదనపు డిఆర్‌డీవో, డీపీఎం తదితరులు జిల్లా సమాఖ్య ప్రెసిడెంట్ సరిత స్వీకరించారని తెలిపారు. మహిళా సంఘాల బాధ్యులు జిల్లాలో బ్యాంకు లింకేజీ ద్వారా రుణం తీసుకుని నూనెమిల్లులు, బిర్యాని పాయింట్స్, టిఫిన్ సెంటర్, పచ్చళ్ళు, మిల్లెట్స్‌పిండి, లడ్డు ఇతర పదార్థాలు, కిరాణం దుకాణాలు, బ్యూటీపా ర్లర్లు, సారీసెంటర్‌లు, జిరాక్స్ సెంటర్‌లు, క్యాంటీన్, ఈవెంట్ మేనేజ్‌మెంట్, డెయిరీ ఉత్ప త్తులు, గేదెల పెంపకం వివిధ రకాల ఆధాయాభివృద్ధి కార్యక్రమాల ద్వారా ఆర్థిక ప్రగతి సాధిస్తూ ముందుకు సాగుతున్నారని తెలి పారు. పిల్లల ఉన్నత విద్యాభ్యాసానికి కూడా రుణాలు సద్వినియో గం చేసుకుంటున్నారని తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరం కూడా ఇందిరా మహిళా శక్తి లక్ష్యం 2025-26 సంవత్సరం డిసెంబర్ లోపు పూర్తిచేసి రాష్ట్రంలో జిల్లాని ప్రథమ స్థానంలో ఉంచాలని కలెక్టర్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీ ణ అభివృద్ధి సంస్థ అధికారి శేషాద్రి, అదనపు అధికారి శ్రీనివాస్, డీపీ ఎంలు, సీసీలు, జిల్లా సమాఖ్య బాధ్యులు పాల్గొన్నారు.

# వానాకాలం 'సాగు' ఖరారు



## పోలీసుల విస్తృత తనిఖీలు



**కరీంనగర్ -నవభూమి:** కరీంనగర్ రూరల్ మండలంలోని పలు ప్రాంతాల్లో రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐ లక్ష్మారెడ్డి, సిబ్బంది విస్తృత తనిఖీలు నిర్వహించారు. ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా మండలంలోని పలు గ్రామాల్లో ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించామని సీఐ తెలిపారు. వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి అనుమానితులను విచారించారు.

## రెవెన్యూ సదస్సులో 90 దరఖాస్తులు



**సైదాపూర్, -నవభూమి:** మండలంలోని వెన్కేపల్లి, రాంచద్రాపూర్ గ్రామాలలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 90 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ గుర్రం శ్రీనివాస్ తెలిపారు. వెన్కేపల్లి లో 67, రాంచంద్రాపూర్ గ్రామంలో 23 దరఖాస్తులు వచ్చాయన్నారు. రైతులు ఇచ్చిన దరఖాస్తులు ఎప్పటికప్పుడు అన్లైన్ చేస్తున్నామన్నారు. భూభారతి చట్టం నిబంధనల ప్రకారం సమస్యలు పరిష్కారిస్తామన్నారు. ఎప్పటికప్పుడు వచ్చిన దరఖాస్తులు పరిశీలించి పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. ఈ నెల 12, 13 తేదీల్లో దుద్దెనపల్లి, బొమ్మకల్ గ్రామాలలో రెవెన్యూ సదస్సులు ఉంటాయని తెలిపారు. రైతులు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కనకయ్య, డీటీలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలి

**కోనరావుపేట, -నవభూమి:** కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని వెంటవెంటనే కొనుగోలు చేయాలని కోరుతూ భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో కోనరావుపేటలో రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు బాలాజీ మాట్లాడుతూ అకాల వర్షాల వల్ల ధాన్యం తడిసి ముద్దవుతుందని అన్నారు. అందుకే కొనుగోలు కేంద్రాల్లో వెంటనే కొనుగోళ్లు చేసి రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు గొట్టె రామచంద్రం, మాజీ జడ్పీటీసీ పల్లం అన్నపూర్ణ, వైస్ఎంపీపీ తీగల రవీందర్‌గౌడ్, మాజీ సర్పంచ్ అనుపాటి బాపురెడ్డి, జిన్నా అనిల్, బైరగోని సురేష్ గౌడ్, శంకర్, తిరుపతి, జితేందర్‌రెడ్డి, శ్రీనివాస్, మల్లేశం, విజయ్, శ్రీను, సుమన్, లక్ష్మారెడ్డి, దామోదర్ రెడ్డి, తీగల జయశ్రీ, విజయ్, రాజు, సాయి పాల్గొన్నారు.



# జోరుగా కొనుగోళ్లు

**కరీంనగర్ -నవభూమి:** వరి కోతలు పూర్తికావస్తుండడంతో ధాన్యం కొనుగోలు కేంద్రాలకు రద్దీ పెరిగింది. ప్రతి కేంద్రానికి వందలాది క్వింటాళ్ల వరిధాన్యం వచ్చి చేరుతున్నది. యాసంగి సీజన్‌లో ఇప్పటి వరకు 1,85,421 మెట్రిక్ టన్నుల వరిధాన్యాన్ని కొనుగోలు చేశారు. 27,903 మంది రైతులకు చెందిన ఈ ధాన్యం విలువ 430.18 కోట్లు కాగా ఇప్పటికే 306 కోట్ల 51 లక్షల రూపాయలు రైతుల ఖాతాల్లో జమ చేశారు. మరో 123.66 కోట్ల రూపాయలు రైతులకు చెల్లించాల్సి ఉన్నది.జిల్లాలో 2,66,896 ఎకరాల్లో వరి సాగు జిల్లావ్యాప్తంగా యాసంగిలో 2,66,896 ఎకరాల్లో వరిసాగు చేశారు. ఇందులో 1,99,051 ఎకరాల్లో దొడ్డు రకాలను, 67,845 ఎకరాల్లో సన్నరకాలను సాగు చేశారు. ఈ సీజన్‌లో 5,86,723 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేశారు. ఇందులో రైతుల సొంత అవసరాలకు మినహాయించుకునే ధాన్యంతోపాటు విత్తన పంటను మినహాయిస్తే 3.6 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తుందని అంచనా వేశారు. ఇందులో 2,74,900 మెట్రిక్ టన్నుల దొడ్డురకం వరిధాన్యం, 85,054 మెట్రిక్ టన్నుల సన్నరకం ధాన్యం రైతులు తీసుకువస్తారని భావించారు. ఇప్పటి వరకు కొనుగోలు కేంద్రాలకు 1,85,421 మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చింది. ఇందులో 1,65,761 మెట్రిక్ టన్నుల ధాన్యం దొడ్డురకానికి చెందినది కాగా, 19,660 మెట్రిక్ టన్నుల ధాన్యం సన్నరకానికి చెందినది. జిల్లా యంత్రాంగం వేసిన అంచనాల్లో ఇప్పటికి కొనుగోలు కేంద్రాలకు వచ్చింది 50 శాతం మాత్రమే కావడం గమనార్హం. గత సీజన్‌లో ఇదే రోజు వరకు కొనుగోలు చేసిన ధాన్యంతో పోల్చితే 24 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం ఎక్కువే కొనుగోలు చేశారు. వరి



కోతలు దాదాపుగా పూర్తికావస్తుండడంతో అధికారుల అంచనాల మేరకు ధాన్యం కొనుగోలు కేంద్రాలకు రాకపోవచ్చని భావిస్తున్నారు. మరో లక్ష టన్నుల ధాన్యం వస్తే ఎక్కువే అనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది.19,660 మెట్రిక్ టన్నుల సన్న ధాన్యం ప్రభుత్వం సన్నరకాలకు ఈ సీజన్‌లో కూడా క్వింటాలుకు 500 రూపాయల బోనస్ చెల్లిస్తున్నది. ఇప్పటి వరకు 19,660 మెట్రిక్ టన్నుల సన్నరకం ధాన్యం కొనుగోలు చేయగా దీనికి 9.21 కోట్ల బోనస్ డబ్బు చెల్లించాల్సి ఉన్నది. ఈ డబ్బు చెల్లింపు కోసం ప్రతిపాదనలు పంపించారు. ఇప్పటికే కొన్ని గ్రామాల్లో వరికోతలు పూర్తికావడంతో కొనుగోలు కేంద్రాలకు ధాన్యం రావడం పూర్తయింది. ఈ నెలాఖరు వరకు దాదాపుగా అన్ని కేంద్రాలకు ధాన్యం వస్తుందని, జూన్ మొదటి వారానికి కొనుగోళ్లు పూర్తవుతాయని అంచనా వేస్తున్నారు.

# వానాకాలం ‘సాగు’ ఖరారు

**సిరిసిల్ల -నవభూమి:** యాసంగి ధాన్యం విక్రయించడం.. వరి కోతలపై దృష్టి సారిస్తూనే వానాకాలం సీజన్ పంటల సాగుకు రైతులు సిద్ధమవుతున్నారు. కోతలు పూర్తయిన భూముల్లో దుక్కులు దున్నుకుంటున్నారు. సమృద్ధిగా ఈసారి వర్షాలు కురుస్తాయని ఖరీఫ్ సాగుపై ఆశలు పెంచుకున్నారు. దీనికి అనుగుణంగానే ఖరీఫ్‌కు సంబంధించి రాజన్న సిరిసిల్ల జిల్లాలో వ్యవసాయ శాఖ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసింది. రైతులకు అవసరమయ్యే విత్తనాలు, ఎరువులను అందుబాటులో ఉంచే విధంగా చర్యలు చేపట్టారు.వానాకాలం సాగు 2.43 లక్షల ఎకరాలు రాజన్న సిరిసిల్ల జిల్లాలో వానాకాలంలో 2 లక్షల 43 వేల 783 ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేస్తారని వ్యవసాయ శాఖ అంచనాలు వేసింది. ఇందులో వరి లక్షా 84వేల 860 ఎకరాలు, పత్తి 49,760 ఎకరాలు, పెసర 79 ఎకరాలు, కందులు 1,155 ఎకరాలు, జొన్నలు 14, మొక్కజొన్న 1,600 ఎకరాలు, ఇతర పంటలు 6,304 ఎకరాల్లో సాగు చేస్తారని అంచనాలు వేశారు. ఇందుకోసం వరి 56,568 క్వింటాళ్ల విత్తనాలు, అవసరం అవుతాయని అంచనాలు వేయగా కందులు 122.5 క్వింటాళ్లు, మొక్కజొన్న 27.04 క్వింటాళ్లు, పత్తి 1,28,650 ప్యాకెట్లు, పెసర్లు 4.08 క్వింటాళ్లు అవసరం అవుతాయని అంచనాలు వేశారు.56,060 మెట్రిక్ టన్నుల ఎరువులు వానాకాలం 2.43 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగు కానుండగా, ఎరువులు 56,060 మెట్రిక్ టన్నులు అవసరం అవుతాయని అంచనాలు వేశారు. యూరియా 25,370 మెట్రిక్ టన్నులు, డీఏపీ 3,460 మెట్రిక్ టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 22,390 మెట్రిక్ టన్నులు, ఎంవోపీ 4,115 మెట్రిక్ టన్నులు, ఎస్ఎస్‌పీ 725 మెట్రిక్ టన్నులు అవసరం అవుతాయని అంచనాలు వేశారు.122 పంటలకు స్వల్పంగా రుణ పరిమితి పెంపు వానాకాలం సీజన్ ప్రారంభానికి ముందే పంట రుణాల పరిమితి(స్కేల్ ఆఫ్ ఫైనాన్స్) ప్రణాళికను ఖరారు చేశారు. రాష్ట్రస్థాయి సాంకేతిక కమిటీ నిర్ణయం మేరకు 2025-26 వానాకాలం, యాసంగి సీజన్‌లకు సంబంధించిన 122 పంటలకు సంబంధించి రుణ పరిమితిని పెంచారు. గతేడాదితో పోలిస్తే రాజన్న సిరిసిల్ల జిల్లాలో సాగు చేసే ప్రధాన పంటల్లో కొన్ని పంటలకు మాత్రమే స్వల్పంగా పరిమితి పెరిగింది. జిల్లాలో ప్రధానంగా వరి సాగు ఎక్కువగా ఉంటుంది. ఈసారి వరి, కంది, మొక్కజొన్న, మినుములు, పెసర, శెనగ, జొన్న తదితర పంటలకు రుణ పరిమితి పెంచలేదు. పత్తి సాగుకు రూ.2 వేలు మాత్రమే పెంచారు. గతేడాది రూ 46 వేల వరకు ఉండగా ఈసారి రూ 48 వేలకు పెరిగింది. పాడి రైతులకు డెయిరీ పెట్టుకోవడానికి అవుకు, గేదెకు రూ.33 వేల నుంచి రూ.35 వేల వరకు రుణం ఇవ్వాలని సూచించారు. గొర్రెలు, మేకలు కొనుగోలుకు సంబంధించి రూ.29 వేలు, ఒక్కో కోడిపిల్లకు రూ 200 నుంచి రూ 210 చొప్పున, చేపలు ఒక హెక్టార్‌కు రూ 4 లక్షలు ఇవ్వాలని



నిర్ణయించారు. స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం బ్యాంకర్లు రుణ లక్ష్యాలను అధిగమించే ప్రయత్నం చేస్తున్న రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు.పత్తికి విత్తన భారం... పత్తిసాగు చేస్తున్న రైతులకు వానాకాలం సీజన్‌లో విత్తన భారం తప్పడం లేదు. ప్రతీయేటా విత్తన ధరలు పెరుగుతున్నా కేంద్రం ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం నుంచి సబ్సిడీ లేకపోవడంతో ప్రైవేటు విత్తన కంపెనీల విత్తనాలు కొనుగోలు చేయడం వల్ల పత్తి రైతులకు విత్తన మోత తప్పడం లేదు. తాజాగా 2025-26 సంవత్సరానికి బీటీ-2 పత్తి విత్తన 475 గ్రాముల ప్యాకెట్ ధరను రూ.901 నిర్ణయిస్తూ కేంద్ర వ్యవసాయ శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. గతేడాది పత్తి విత్తన ప్యాకెట్ ధర రూ.864 ఉండగా ఈసారి రూ 37 అదనంగా పెంచుతూ నిర్ణయించింది. దీంతో రాజన్న సిరిసిల్ల జిల్లా రైతులపై అదనంగా రూ.30 లక్షల వరకు భారం పడుతుంది. జిల్లాలో మిడ్ మానేరు, మల్కపేట, అన్నపూర్ణ ప్రాజెక్టలతో పాటు ఎగువ మానేరు ప్రాజెక్టలోకి నీటిని నింపడం భూగర్భ జలాలు పెరిగి బోరుబావుల్లోనూ నీటి మట్టాలు వానాకాలం సీజన్‌లో పెరుగుతున్న క్రమంలో జిల్లాలో రైతులు వరి పత్తిసాగు వైపు మొగ్గు చూపుతున్నారు. గతంలో జిల్లాలో లక్షకు పైగా ఎకరాల్లో పత్తి సాగు జరిగేది. ప్రస్తుతం 49,760 వేల ఎకరాల వరకు వానాకాలం సీజన్‌లో సాగుకు సిద్ధమయ్యారు. ఖరీఫ్‌లో రైతులు వరితో పాటు పత్తివైపు మొగ్గు చూపుతున్న క్రమంలో కేంద్ర ప్రభుత్వం విత్తన భారం వేసింది. గతేడాది పత్తి విత్తనాల ప్యాకెట్ రూ.864 ఉండగా ప్రస్తుతం 901 వరకు పెంచారు. ఒక ప్యాకెట్‌పై రూ.37 పెరిగింది. దీంతో పాటు ఎరువులు, మందులు, వ్యవసాయ కూలీల ధరలు రైతులకు మరింత భారాన్ని పెంచింది. ఈ సారి రైతులు దాదాపు రూ 30 లక్షల అదనపు భారాన్ని మోయాల్సి వస్తుంది. ప్రతియేటా విత్తనాల ధరలు పెరుగుతూనే ఉన్నాయి. పత్తి పండించే రైతులు ప్రైవేటులోనే విత్తనాఉల కొనుగోలు చేయాల్సి వస్తుంది. రైతులు ఎక్కువగా బీటీ 2 విత్తనాలనే వినియోగిస్తున్నారు. ఎకరానికి రెండుప్యాకెట్లకు పైగానే ఉపయోగిస్తారు. మరోవైపు అనుకూల పరిస్థితులులేని పక్షంలో రెండవ సారి కూడా విత్తనాలు వేసుకునే పరిస్థితి ఉంటుంది.

# బాబు జగ్జీవన్ రామ్ వ్యవసాయ కళాశాల వార్షికోత్సవం



**తంగళ్లపల్లి, -నవభూమి:** తంగళ్లపల్లి మండలం జిల్లె ల్ల గ్రామంలోని బాబు జగ్జీవన్ రామ్ వ్యవసాయ కళాశాల వార్షి కోత్సవాన్ని శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమా నికి జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్‌బేగం, రామయ్యపేట రైతు ఉత్పత్తిదారుల సంస్థ చైర్మన్ శ్రేవ్‌రావు, సైనోవిట ఫార్మర్ సొల్యూ షన్ మేనేజింగ్ డైరెక్టర్ గౌతమ్‌రెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజ రయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు దేశా న్ని పోషిస్తున్నారన్నారు. విద్యార్థులు గురువులను గౌరవిస్తూ, మానసిక దృఢత్వంతో ముందుకు సాగాలని సూచించారు. రైతు లు ఐక్యంగా ఉండి అభివృద్ధి సాధించాలని అన్నారు. కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ కె.బి సునీతా దేవి కళాశాల విజయాలు, రాబోయే రోజుల్లో చేయవలసిన ప్రణాళికలు తదితర అంశాలను వివరించారు. అలాగే కళాశాల మ్యాగజైన్ ఆవిష్కరించారు. కళాశాల దత్తత గ్రామం రాళ్ళపేట ఆదర్శ రైతులను సన్మానించారు. అనంతరం వివిధ ఆటల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. విద్యార్థులు ఆటపాటతో సందడి చేశారు. ఈ కార్యక్రమానికి స్వాగత ఉపన్యాసం డాక్టర్ భవ్యశ్రీ ఇవ్వగా, కళాశాల ఓఐఎస్ఏ డాక్టర్ రమేష్ కార్యక్రమానికి హాజరైన వారికి ధన్యవాదాలు తెలిపారు.

# ఎన్టీపీసీ ప్లాంటులో విపత్తు జరిగితే ఎదుర్కొంటాం

**జ్యోతినగర్,-నవభూమి:** ఎన్టీపీసీ ప్లాంటులో ఏవైనా అనుకోని ఘటనలు జరిగితే వాటిని సమర్థవంతంగా ఎదుర్కొంటామని రామగుండం సీపీ అంబర్ కిశోర్ ఝా స్పష్టం చేశారు. ఈ విషయంలో ప్రతీ క్షణం అధికార యంత్రాంగం, సిబ్బంది సన్నద్ధంగా ఉందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు శుక్రవారం సాయంత్రం ఎన్టీపీసీ ప్రాజెక్టు ఆవరణలో భద్రతా సిబ్బందితో సీపీ ఆధ్వర్యంలో మాక్ డ్రిల్ నిర్వహించారు. అనుకోని దుస్సంఘటన జరిగినప్పుడు అప్రమత్తంగా ఉండడంలో భాగంగా తీసుకోవాల్సిన చర్యలకు సంబంధించి మాక్‌డ్రిల్ నిర్వహించినట్లు సీపీ పేర్కొన్నారు. ఏదైనా ప్రమాదం, అగ్నిప్రమాదాలు జరినప్పుడు భద్రతా దళాలు ఎలాంటి చర్యలు తీసుకోవాలనే అంశాలను మాక్‌డ్రిల్ ద్వారా వి వరించామన్నారు. కార్యక్రమంలో పెద్దపల్లి డీసీపీ కరుణాకర్, గోదావరిఖని ఏసీపీ ఎం రమేష్, ఎస్‌బీ ఏసీపీ రాఘవేంద్రరావు, ఎన్టీపీసీ ఎస్ఐ ఉదయ్ కిరణ్,భద్రతా సిబ్బంది పాల్గొన్నారు.సీఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో మాక్ డ్రిల్ రామగుండం ఎన్టీపీసీ ప్రాజెక్టు ఆ వరణలో సీఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో శు క్రవారం మాక్ డ్రిల్ నిర్వహించారు. పాకిస్తాన్‌తో యుద్ధం జరుగుతున్న క్రమంలో ఏదైనా విపత్తు జరిగితే తీసుకోవాల్సిన చర్యలకు సంబంధించి మాక్ డ్రిల్ నిర్వహించారు. బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ తనిఖీలు, ప్రాజెక్టు పరిసరాల్లో, పని స్థలాల్లో తనిఖీలు తదితర అంశాలను మాక్ డ్రిల్‌లో ప్రదర్శించారు. సీఐఎస్ఎఫ్ రావగుండం ఎన్టీపీసీ యూనిట్ సీనియర్ కమాండెంట్ అరవింద్ కుమార్, డిప్యూటీ కమాండెంట్ ఆంజనేయరాజు, డిప్యూటీ కమాండెంట్ ఓవికె శాస్త్రి పర్యవేక్షణలో జరిగిన మాక్ డ్రిల్‌లో అసిస్టెంట్ కమాండెంట్లు జై కన్వర్, అకేశ్వర్‌సింగ్, ఇన్‌స్పెక్టర్లు, జవానులు పాల్గొన్నారు.



# మురుగు..కనుమరుగు



**జగిత్యాల, -నవభూమి:** జగిత్యాల మున్సిపాలిటీ కొత్త రూపు సంతరించుకోనుంది. నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్‌ల సూచనలతో జగిత్యాలలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణానికి యూఐడీఎఫ్ ద్వారా రూ.400 కోట్లు నిధులతో డీపీఆర్‌ను సిద్ధం చేశారు. ఈ నిధులతో కిలోమీటర్ల మేర అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మించనున్నారు. పైపులైన్ విధానంలో నిర్మించే ఈ ప్రాజెక్టు పూర్తయితే జగిత్యాలలో డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించనుంది.21,700 నివాస గృహాలు..జగిత్యాల మున్సిపాలిటీ పరిధిలో 21,700 గృహాలు ఉన్నాయి. వీటి ద్వారా వెలువడుతున్న మురుగు నీరు డ్రైనేజీల ద్వారా ముందుకు సాగుతోంది. అయితే అడ్డంకులు, అసంపూర్తి నిర్మాణాలతో నీరు నిలిచి చెత్త, చెదారం పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతుండడమే కాక దోమల వృద్ధికి కారణమవుతోంది. చిన్నపాటి వర్షం వచ్చినా నీరంతా రోడ్లపైకి చేరుతోంది. ఈ సమస్య పరిష్కారం కోసం అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా 2 వేలకు పైగా మ్యాన్‌హోల్స్, 7,233 ఇన్స్‌పెక్షన్ చాంబర్స్ ఏర్పాటు ఏర్పాటు చేసి 108.5 కిలోమీటర్ల నిడివితో పైపులైన్ నిర్మిస్తారు. ఇళ్లలో నుంచి నీటిని మ్యాన్‌హోల్స్‌లోకి అక్కడి నుంచి సబ్ లైన్స్, ఆపై ట్రంక్ మెయిన్ ద్వారా సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (మురికినీటి శుద్ధి కేంద్రం)కు పంపుతారు.నాలుగు జోన్లుగా విభజన..అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణంలో భాగంగా జగిత్యాలను నాలుగు జోన్లుగా విభజించారు. పట్టణాన్ని మొదటి జోన్‌గా, శివారు ప్రాంతాలను 2, 3, 4 జోన్లగా నిర్ధారించారు. ఆయా జోన్లలోని లోతట్టు ప్రాంతాల్లో సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు (ఎస్‌టీపీ) నిర్మించి అక్కడికి మురుగునీటిని మళ్లీస్తారు. అక్కడ నీటిని శుద్ధి చేసి వ్యవసాయ అవసరాలతో పాటు పార్క్, డివైడర్లు, రోడ్ల పక్కన పెంచుతున్న మొక్కలకు వినియోగిస్తారు. ప్రస్తుతం ఇళ్లలో నుంచి వెలువడుతున్న మురుగునీరు చెరువులు, కాలువల్లో కలిసి కలుషితమవుతోంది. యూజీడీ పనులు పూర్తయితే ఈ సమస్యలకు పరిష్కారం లభిస్తుంది. ఈ పనులను ఒప్పందం ప్రకారం రెండేళ్లలో పూర్తి చేయాల్సి ఉండగా అధికారులు, ప్రజాప్రతినిధులు ఏడాదిన్నరలోనే పూర్తి చేయాలని యోచిస్తున్నారు. పనులు పూర్తయ్యాక పదేళ్లపాటు నిర్మాణ కంపెనీయే నిర్వహణ బాధ్యతలు చూసుకుంటుంది. మురుగునీరు ముందుకు సాగేలా అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మిస్తుండగా వర్షపు నీటిని తరలించేందుకు స్టార్మ్ వాటర్ డ్రెయిన్ (ఎస్‌డబ్ల్యూడీ) సిస్టమ్ నిర్మించనున్నారు.ఇవీ ప్రయోజనాలు..అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సిస్టంతో పట్టణంలో వర్షపు నీరు ప్రణాళిక బద్ధంగా తొలగించడుతుంది. దీనివల్ల రోడ్లు, ఇతర ప్రాంతాలు నీటితో నిండిపోకుండా ఉంటాయి. గాలిలో దుమ్ము, మట్టి తక్కువగా ఉండడం వల్ల ప్రజలు ఆరోగ్యానికి ఇబ్బంది కలగదు. పట్టణంలో గాలి స్వచ్ఛంగా ఉండే అవకాశాలున్నాయి. భవిష్యత్తులో అభివృద్ధి, ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడుతాయి. పట్టణంలో ఆరోగ్యకరమైన, పరిశుభ్రమైన వాతావరణం కల్పించే అవకాశాలుంటాయి.నిధుల మంజూరుకు గ్రీన్‌సిగ్నల్..జగిత్యాల పట్టణ సమగ్రాభివృద్ధికి రూ.400 కోట్లు మంజూరు చేయడానికి కేంద్ర పట్టణాభివృద్ధి, గృహ నిర్మాణ శాఖ కార్యదర్శి శ్రీనివాస్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. నెల రోజుల క్రితం జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్ న్యూఢిల్లీలోని కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ కార్యాలయంలో నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్, నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు మోరపల్లి సత్యనారాయణ, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్‌లతో కలిసి కేంద్ర పట్టణాభివృద్ధి, గృహ నిర్మాణ శాఖ కార్యదర్శి శ్రీనివాస్‌ను కలిసి నిధుల మంజూరుకు విన్నవించారు. జగిత్యాలలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ, మురుగు నీటి శుద్ధి ప్లాంటు అవసరాలకు నిధులు మంజూరు చేయాలని కోరారు. రూ.400 కోట్ల అంచనాతో డిటేల్డ్ ప్రాజెక్టు రిపోర్టు రూపొందించి అందించారు. యూఐడీఎఫ్ పథకం కింద అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, ఎస్‌టీపీ సీనరేజ్ ప్లాంట్‌కు నిధులు మంజూరు చేయాలని కోరారు. నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ ప్రత్యేక చొరవ చూపడం, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్ ప్రయత్నాలతో కేంద్రం నిధుల మంజూరుకు హామీ ఇచ్చింది. నిధుల మంజూరు పూర్తయితే పట్టణంలో యూజీడీకి సంపూర్ణంగా లైన్‌క్లియర్ అయినట్లవుతుంది. ఇందుకు అనుగుణంగా కేంద్రం సంకేతాలు ఇవ్వడంతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీపై ప్రజల్లో ఆశలు పెరుగుతున్నాయి.అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణానికి కృషి మాకునూరి సంజయ్ కుమార్, జగిత్యాల ఎమ్మెల్యే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో జగిత్యాల మున్సిపల్‌లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణానికి అవసరమైన కృషి చేస్తున్నా. ఇప్పటికే డిటేయిల్డ్ ప్రాజెక్టు రిపోర్టును తయారు చేసి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సమర్పించాం. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించారు. కేంద్రం నుంచి సహకారం అందేలా ఎంపీ అరవింద్ కృషి చేస్తున్నారు. సాధ్యమైనంత తొందరలో యూజీడీ నిధులు మంజూరుతో పాటు నిర్మాణం జరిగేలా కృషి చేస్తున్నా.

# తడి,పొడి చెత్తను వేరు చేయాలి

**కరీంనగర్ -నవభూమి:** ప్రతిరోజు తడి పొడి చెత్తను వేరు చేసి డంపు యార్డుకు చెత్తను తగ్గించాలని నగరపాలక సంస్థ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ అన్నారు. నగరంలోని మల్కాపూర్, లక్ష్మీపూర్, కొత్తపల్లిలో కమిషనర్ శుక్రవారం పర్యటించారు. మల్కాపూర్, కొత్తపల్లిలో గతంలో వినియోగించిన డంపు యార్డులను, డీఆర్‌సీసీ సెంటర్, వర్మికంపోస్టు పిట్స్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఇంట్లో ప్రతి రోజు ఉత్పత్తి అయ్యే చెత్తను ఇంట్లోనే వేరు చేసి బుట్టల ద్వారా నగరపాలక సంస్థ కార్మికులకు అందించాలని సూచించారు. చెత్తను సేకరించి స్వచ్ఛ ఆటోల ద్వారా కొత్తపల్లి, మల్కాపూర్ డంపు యార్డు వద్ద పొడి చెత్తలోని డబ్బాలు, అట్టముక్కలు, ఇతర వస్తువులను డీఆర్‌సీసీకి తరలించాలన్నారు. తడి చెత్తను స్థానికంగా ఉన్న వర్మికంపోస్టు పిట్స్ ద్వారా సేంద్రీయ ఎరువులుగా మార్చాలన్నారు. సెగ్రిగేషన్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించి డంపు యార్డుకు వెళ్లే చెత్తను పూర్తిస్థాయిలో తగ్గించాలన్నారు. నగరవ్యాప్తంగా ప్రతి డివిజన్‌లో పారిశుధ్య పనులు సక్రమంగా నిర్వహించి కాలనీలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ప్రతి ఇంటి నుంచి చెత్తను కార్మికులు తప్పకుండా సేకరించి వంద శాతం సెగ్రిగేషన్ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ వేణు మాధవ్, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.



## ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా ప్లకార్డుల ప్రదర్శన



**సిరిసిల్ల -నవభూమి:** పాకిస్థాన్ ఉగ్రవాదుల పై ఆపరేషన్ సిందూర్ పేరుతో భారత సైన్యం వీరోచితంగా పోరాటం చేయడం హర్షనీయమని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షు డు మూషం రమేష్ అన్నారు. సిరిసిల్ల పట్టణంలోని కోత్తబస్టాం డ్‌లో సీఐటీయూ పాలిస్టర్ వార్పిన్ వర్కర్స్ ఆధ్వర్యంలో శుక్రవారం నాయకులు, కార్మికులు ప్లకార్డులు పట్టుకుని ఆపరేషన్ సిం దూర్‌పై హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లా డుతూ భారత దేశంలోని కాశ్మీర్‌లోని పర్యాటక ప్రాంతమైన పహల్గాంలో హిందువులపై పాకిస్థాన్ ఉగ్రవాదులు దాడులు చేసి 26మంది పర్యాటకులను కాల్చిచంపారన్నారు. దానికి ప్రతీ కారంగా పాకిస్తాన్‌లోని ఉగ్రవాదుల స్థావరాలపై మన సైనికు లు వీరోచితంగా పోరాడి ముట్టబెట్టడం జరిగిందన్నారు. అదే విధంగా పాకిస్థాన్ మళ్లీ అలాంటి సంఘటనలు చేయకుండా బుద్ధి చెప్పే విధంగా పెద్దఎత్తున దాడులు నిర్వహించడం హర్షనీయన్నారు. ఈ కార్యక్రమంలో వార్పిన్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు సిరిమల్లె సత్యం, కుమ్మరికుంట కిషన్, ఉడుత రవి, ఎలిగేటి రాజశే ఖర్, ఐరన్ ప్రవీణ్, మచ్చవేణు, ప్రసాద్, బూట్ల వెంకటేశ్వర్లు తదితరు లు పాల్గొన్నారు.

## వాహనాలు, హమాలీల కొరత రాకుండా చర్యలు

**ఓదెల,-నవభూమి:** ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో లారీలు, హమాలీల కొరత రాకుండా చర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్ డి వేణు తెలిపారు. ప్రచురితమైన 'కొనుగోళ్లలో జాప్యం-పేరుకుపోతున్న ధాన్యం' అనే శీర్షిక కథనం ప్రచురితమైంది. దీనికి అధికారులు స్పందించారు. ఈ మేరకు శుక్రవారం ఓదెలలోని ఐకేపీ, పీఏసీఎస్ ధాన్య కొనుగోలు కేంద్రాలను అదనపు కలెక్టర్ వేణుతో పాటు సివిల్ సప్లై డీఎం శ్రీకాంత్, డీసీవో శ్రీమాల తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ వేణు మాట్లాడుతు, నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేసి మిల్లులకు తరలిస్తున్నామన్నారు. ధాన్యం రవాణాలో ఎలాంటి జాప్యం చేయవద్దని, కేంద్రాల్లో హమాలీల సమస్యలు రాకుండా చూసుకోవాలని తెలిపారు. వాతావరణ పరిస్థితుల దృష్ట్యా జిల్లాలోని కొనుగోలు కేంద్రాల వద్ద అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రైతులకు అవసరమైతే టార్పాలిన్ కవర్లు సిద్ధంగా ఉంచాలన్నారు. రైతులకు మద్దతు ధరతో పాటు సన్నరకం ధాన్యానికి ఐదువందల రూపాయల బోనస్ డబ్బులు రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ అయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ధాన్య కొనుగోలుతో పాటు తూకం, లోడింగ్ వేగవంతం చేయాలని కోరారు. అలాగే మండలంలోని ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ సజావుగా జరుగుతోందని తెలిపారు. రైతుల వద్ద నుంచి కొనుగోలు చేసిన ధాన్యం వివరాలు ఎప్పటికప్పుడు ట్యాబ్ ఎంట్రీ పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ ఆళ్ల సుమన్ రెడ్డి, సీసీ విజయ, కేంద్రాల నిర్వహకులు తదితరులు పాల్గొన్నారు.



# జీపీవోల నియామకానికి కసరత్తు



**పెద్దపల్లి -నవభూమి:** గ్రామాల్లో రెవెన్యూ సమస్యల పరిషారం కోసం గ్రామానికి ఒక పాలనాధికారి (జీపీవో)ను నియమించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. గతంలో గ్రామ రెవెన్యూ అధికారి (వీఆర్వో) గ్రామ రెవెన్యూ అసిస్టెంట్ (వీఆర్ఏ)గా పనిచేసిన వారిలో ఆసక్తి ఉన్న వారి నుంచి ప్రభుత్వం దరఖాస్తులను ఆహ్వానించింది. వీఆర్వోల నుంచి 39 మంది, వీఆర్ఏల నుంచి 71 మంది, మొత్తం 110 మంది దరఖాస్తు చేసుకున్నారు. వచ్చే వారంలో వీరికి స్క్రీనింగ్ పరీక్ష నిర్వహించి ఎంపిక చేసి నియామకపత్రాలను అందజేయనున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 2015లో రెవెన్యూ చట్టంలో మార్పులు, చేర్పులు చేసేందుకు భూ ప్రక్షాళన చేపట్టిన విషయం తెలిసిందే. పాత పట్టాదారు పాసు పుస్తకాల స్థానంలో హైసెక్యూరిటీ పాసు పుస్తకాలను ప్రభుత్వం జారీ చేసింది. భూ రికార్డుల ప్రక్షాళనలో భాగంగా చాలా వకు తప్పిదాలు జరిగాయి. పట్టాదారుల పేర్లు, సర్వే నంబర్లు తప్పుగా రావడం, విస్తీర్ణం ఎక్కువ, తక్కువ చూపడం, తదితర తప్పులు దొర్లాయి. అవే తప్పులతో భూముల వివరాలన్నింటికీ కంప్యూటరైజ్డ్ చేశారు. తప్పొప్పుల సవరణకు అవకాశం ఇవ్వకుండానే ప్రభుత్వం ధరణి పోర్టల్‌ను తీసుకు వచ్చింది. భూముల వివరాలను పోర్టల్‌లో పెట్టింది. ఆ వివరాలను ఎవరైనా చూసుకునే వీలు కల్పించింది. పహాణి పుస్తకాల్లో అనుభవదారు పేరు, కబ్జా కాలాన్ని తొలగించింది. తహసీల్దార్ కార్యాలయాల్లోనే వ్యవసాయ భూములను రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం కల్పించారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న వెంటనే ముటేషన్ పూర్తి చేసి వారం, పది రోజుల్లో పట్టాదారు పాసు పుస్తకం ఇంటికి వచ్చేలా చేశారు. భూముల రిజిస్ట్రేషన్ కోసం స్లాట్ బుకింగ్ విధానాన్ని తీసుకువచ్చారు. ధరణి పోర్టల్‌లో పట్టాదారులుగా ఉన్న వారు మాత్రమే భూములను విక్రయించుకునే అవకాశం కల్పించారు. భూ రికార్డుల ప్రక్షాళన సమయంలో ఆన్‌లైన్‌లో ఒకరికి బదులు మరొకరి పేరు వచ్చినప్పుడు, సదరు వ్యక్తి భూమిని విక్రయించి రిజిస్ట్రేషన్ ఈజీగా చేసుకునే వీలు కల్పించారు. ఈ భూమి తనది కాదని, రికార్డుల్లో పేరు తప్పుగా పడిందని, మోఖా మీద మేమే ఉన్నామని రిజిస్ట్రేషన్ ప్రక్రియను నిలిపివేయాలని తహసీల్దార్‌కు విన్నవించినా కూడా నిలిపివేసే అవకాశం లేకుండా పోయింది. ధరణి పోర్టల్‌కు భద్రత లేదు. తప్పొప్పుల సవరణ కోసంకలెక్టర్, తహసీల్దార్ల చుట్టూ తిరుగుతున్నా నేటికి కూడా పరిష్కారం కావడం లేదు. రెవెన్యూ కోర్టులను ఎత్తివేయడంతో పాటు వీఆర్వో, వీఆర్ఏ వ్యవస్థలను కూడా అప్పటి ప్రభుత్వం ఎత్తి వేసింది. ధరణి పోర్టల్ 2020 అక్టోబరు నెల నుంచి అందుబాటులోకి వచ్చింది. వీఆర్వో, వీఆర్ఏ వ్యవస్థను రద్దు చేసిన తర్వాత వారిని ఇతర శాఖల్లోకి సర్దుబాటు చేసేందుకు రెండు, మూడేళ్లు పట్టింది. వీఆర్వోలను సర్దుబాటు చేసే వరకు వారంతా ప్రతీ రోజు తహసీల్దార్ కార్యాలయాలకు వచ్చి హాజరు వేసుకుని వెళ్లారు. 2022లో జిల్లాలో 117 మంది వీఆర్వోలను వారి విద్యార్హతలను బట్టి మున్సిపల్, నీటి పారుదల శాఖ, తదితర శాఖల్లో సర్దుబాటు చేశారు. అలాగే 2023 ఆగస్టులో 407 మంది వీఆర్ఏలను వివిధ శాఖల్లో సర్దుబాటు చేశారు. వారి విద్యార్హతలను బట్టి జూనియర్ అసిస్టెంట్, రికార్డు అసిస్టెంట్, ఆఫీస్ సబార్డినేట్‌లుగా పోస్టింగులు ఇచ్చారు. రెవెన్యూ శాఖలో పది, పదిహేను సంవత్సరాలు పనిచేసిన వీఆర్వోలు, వీఆర్ఏల సర్వీస్ అంతా జీరో అయ్యింది. పదోన్నతులకు కూడా నోచుకోలేని పరిస్థితి ఏర్పడింది. జిల్లాలో 215 రెవెన్యూ గ్రామాలు..ధరణితో రైతులు, వివిధ వర్గాల ప్రజలు పడుతున్న ఇబ్బందులను గమనించిన కాంగ్రెస్ ప్రభుత్వం దాని స్థానంలో భూభారతి చట్టాన్ని తీసుకు వచ్చింది. దీని ద్వారా తహసీల్దార్లు, ఆర్డీవోలు, రెవెన్యూ విభాగం అదనపు కలెక్టర్లకు సైతం కొన్ని అధికారాలను కట్టబెట్టారు. భూ రికార్డులను ఆన్‌లైన్‌లోనే గాకుండా మ్యాన్యువల్‌గా కూడా నమోదు చేయనున్నారు. రెవెన్యూ సమస్యలను క్షేత్రస్థాయిలో వేగంగా పరిశీలించేందుకు గాను గ్రామానికి ఒక పరిపాలనాధికారిని నియమించాలని నిర్ణయించింది. జిల్లాలో 215 రెవెన్యూ గ్రామాలు ఉండగా, ఒక్కో అధికారిని నియమించనున్నారు. ఇందుకు మొదట పూర్వ వీఆర్వోలు, వీఆర్ఏలకు అవకాశం ఇచ్చింది. డిగ్రీ పూర్తి చేసిన వీఆర్వోలు, ఇంటర్ పూర్తి చేసి ఐదేళు అనుభవం ఉన్న వీఆర్ఏలు దరఖాస్తు చేసుకోవాలని ప్రకటించింది. ఆ మేరకు జిల్లాలో 110 మంది దరఖాస్తు చేసుకున్నారు. వారి వివరాలను జిల్లా అధికారులు సీసీఎల్ఏకు పంపించారు. భూభారతి చట్టం వచ్చే నెల 3వ తేదీ నుంచి అమల్లోకి రానున్నందున ఆ లోపు గ్రామ పాలనాధికారులను నియమించనున్నారు. దరఖాస్తు చేసుకున్న వారికి వచ్చే వారంలో స్క్రీనింగ్ టెస్టు నిర్వహించి నియమించనున్నారు.

# విలీన గ్రామాల్లో 'ఉపాధి' కరువు

**భగత్‌నగర్,-నవభూమి:** కరీంనగర్ నగర పాలక సంస్థలో కొత్తపల్లి మండలంలోని చింతకుంట, మల్కాపూర్ గ్రామాలు విలీనమవడంతో ఉపాధి హామీ పనులు కనుమరుగయ్యాయి. దీంతో చింతకుంట, మల్కాపూర్, మల్కాపూర్ అనుబంధ గ్రామమైన లక్ష్మీపూర్ గ్రామాల్లో ఉపాధి హామి కూలీపైనే ఆధారపడి ఉన్న వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొత్తపల్లి మండలంలోని చింతకుంటలో 645 జాబ్‌కార్డులుండగా, 759 కూలీలున్నారు. 457 మంది జాబ్‌కార్డులు యాక్టివ్‌గా ఉండగా, 513 మంది కూలీలు పనిచేసే వారు. మల్కాపూర్, లక్ష్మీపూర్‌లో 432 జాబ్‌కార్డులు ఉండగా, 547 మంది కూలీలు పనిచేస్తున్నారు. 342 యాక్టివ్ జాబ్‌కార్డులు ఉన్నాయి. 401 మంది కూలీలు రోజు వారీగా పనిచేసే వారు. వీరంతా ఉపాధి కరువై ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తపల్లి మండలంలోని చింతకుంట, మల్కాపూర్ గ్రామాలను కరీంనగర్ కార్పోరేషన్‌లో విలీనం చేయడంతో ఉపాధి హామీ పథకాన్ని ఈ గ్రామాల్లో ప్రభుత్వం ఎత్తి వేశారు. ప్రభుత్వం ఈ గ్రామాల్లో ప్రత్యామ్నాయ ఏర్పాట్లుచేయాలి ఉపాధి హామికూలీలు వేడుకుంటున్నారు. కూలీలకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లుచేయాలి భూక్య తిరుపతినాయక్, కొత్తపల్లి మాజీ వైస్ ఎంపీపీ చింతకుంట, మల్కాపూర్ గ్రామాలు నగరపాలక సంస్థలో విలీనం కావడంతో ఉపాధి హామీ కూలీలు పనుల కోల్పోయారు. ఈ గ్రామాల్లో ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు, ఇతర సిబ్బందికి మున్సిపాలిటీలో పని కల్పించారు. ఉపాధి హామీ కూలీలు పనులు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఉపాధి హామీ కూలీలకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లుచేయాలి. ఉపాధి కరువు.. దేనవేని రజిత, ఉపాధి హామీ కూలీ ఉపాధి హామీ పథకాన్ని చింతకుంటలో ప్రభుత్వం తీసి వేయడంతో మాకు ఉపాధి కరువైంది. ప్రభుత్వం, అధికారులు ఉపాధి హామి కూలీలకు పనులు కల్పించి తమను ఆదుకోవాలి. పనులు కల్పించాలి గుడాల సరిత, ఉపాధి హామి కూలీ, చింతకుంట ఉపాధి హామీ పథకాన్ని తీసి వేయడంతో పనులు కోల్పోయిన మాకు పనులు కల్పించి ప్రభుత్వం ఆదుకోవాలి. గతంలో ఉపాధి హామీ కూలీపైనే ఆధారపడి జీవించే వాళ్లం. ఉపాధి హామీ పథకం తీసివేయడంతో పనులు దొరకక ఇబ్బందులు పడుతున్నాము. అధికారులు, ప్రభుత్వం కూలీ కల్పించాలి.



# భూసమస్యల పరిష్కారానికి పకడ్బందీ చర్యలు



**ఎలిగేడు,-నవభూమి:** గ్రామాల్లో రెవెన్యూ సదస్సుల ద్వారా వస్తున్న భూసమస్యల పరిష్కారానికి కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులకు సూచించారు. ఎలిగేడు తహసీల్దార్ కార్యాలయాన్ని కలెక్టర్ కోయ శ్రీహర్ష శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు పెద్దపల్లి జిల్లాలో ఎలిగేడు మండలం పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశామన్నారు. భూభారతి చట్టం కింద భూసమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టామని, గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించి రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. మే 19 వరకు ఉన్న షెడ్యూల్ ప్రకారం గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామన్నారు. భూరికార్డుల సమస్యలు ఉంటే ప్రజలు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ కోరారు. పైలెట్ ప్రాజెక్టు కింద ఎలిగేడు మండలంలో ఇప్పటివరకు 614 దరఖాస్తులు స్వీకరించినట్లు కలెక్టర్ తెలిపారు. ప్రజలనుంచి వచ్చే దరఖాస్తులను ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూభారతి చట్టం ద్వారా పరిష్కరించేందుకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని, కోర్టు సమస్యలు, కుటుంబ వివాదాలు మినహాయించి మిగిలిన భూసమస్యలను జూన్ 2లోపు పరిష్కరించేలా కార్యచరణ అమలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో తహసీల్దార్ బషరోద్దీన్, డిప్యూటీ తహసీల్దార్ కిరణ్‌కుమార్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.కొనసాగుతున్న రెవెన్యూ సదస్సులు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూభారతి చట్టంపై జిల్లాలోని ఎలిగేడు మండలంను పైలట్ ప్రాజెక్టుగా తీసుకొని నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులకు రైతుల నుంచి అనూహ్య స్పందన వస్తోంది. ఈనెల 5వ తేదీన ప్రారంభమైన రెవెన్యూ సదస్సుల్లో ఇప్పటివరకు ఎలిగేడులో 181, బురహాన్‌మియాపేటలో 96, లాలపల్లిలో 105, నర్సాపూర్‌లో 145, నారాయణపల్లిలో 46, సుల్తాన్‌పూర్‌లో 53, ధూళికట్టలో 55చొప్పున రైతులు భూసమస్యలపై దరఖాస్తులను అధికారులకు అందజేశారు.

# కోరుట్లలో రద్దీ ప్రాంతాల్లో పోలీసుల తనిఖీలు



**కోరుట్ల, -నవభూమి:** పట్టణంలో నిత్యం జన సమ్మర్ధంతో రద్దీగా ఉండే ప్రాంతాల్లో శనివారం కోరుట్ల పోలీసులు డాగ్ స్క్వాడ్ బృందంతో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కోరుట్ల కొత్త బస్టాండ్, ఆర్బీ హెూటల్ పరిసరాలు, కిసాన్ షాపింగ్ మాల్లో, పూజ స్వీట్ హౌజ్ సమీపంలో తనిఖీలు చేపట్టారు.ప్రయాణీకుల లగేజీతో పాటూ బాటసారుల బ్యాగులను క్షుణ్ణంగా పరిశీలించారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో సాధారణ తనిఖీల్లో భాగంగా ముందస్తు జాగ్రత్త కోసం తనిఖీలు నిర్వహించామని ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు. అనుమానస్పద వ్యక్తుల కదలికలపై పోలీసులకు సమాచారం అందించాలని

# అకాల వర్షంతో తడిసిన వరి ధాన్యం ను పరిశీలించిన విప్ లక్ష్మణ్ కుమార్

**ధర్మారం, -నవభూమి:** పెద్దపల్లి జిల్లా ధర్మారం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో వరి ధాన్యం అకాల వర్షంతో తడవడంతో ప్రభుత్వ విప్ ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ యార్డును సందర్శించారు. 'అకాల వర్షంతో ధర్మారం మార్కెట్ యార్డులో తడిసిన వరి ధాన్యం' అనే శీర్షికన 'నమస్తేతెలంగాణ' కథనం ప్రచురించింది. సమాచారం తెలుసుకున్న లక్ష్మణ్ కుమార్ సాయంత్రం మార్కెట్ యార్డును సందర్శించి తడిసిన ధాన్యం ను పరిశీలించారు.

# దొంగతుర్తిలో తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి తీవ్ర గాయాలు



**ధర్మారం, -నవభూమి:** పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం దొంగతుర్తి గ్రామంలో శనివారం తాటి చెట్టు పై నుంచి పడి పంతంగి శ్రీనివాస్ గౌడ్ అనే గీత కార్మికుడు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన శ్రీనివాస్ గౌడ్ సాయంత్రం సమయంలో గ్రామ శివారులో కల్లు గీయడానికి తాటిచెట్టు ఎక్కాడు. తాటి చెట్టు ఎక్కుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు మోకుజారి కిందపడ్డాడు.దీంతో శ్రీనివాసగౌడ్ నడుముకు, శరీర ఇతర భాగాలకు రక్త గాయాలైనట్లు గీత కార్మికులు తెలిపారు. శ్రీనివాస గౌడ్ ప్రమాదానికి గురి కావడంతో అక్కడే ఉన్న చోటు గీత కార్మికులు హుటాహుటిన అతనిని చికిత్స కోసం పెద్దపల్లిలోని ప్రభుత్వ దవాఖానకు తరలించారు. శ్రీనివాస్ గౌడ్ కు మెరుగైన చికిత్స అందించి ఆయనకు ప్రభుత్వం మార్గ సహాయం అందించాలని గ్రామ గీత కార్మిక సంఘం నాయకుడు బాలసాని తిరుపతి గౌడ్ కోరారు.

# గోదావరిఖనిలో కళోత్సవాలు..

**కోల్ సిటీ, -నవభూమి:** ఈనెల 17న గోదావరిఖనిలో నిర్వహిస్తున్న కళోత్సవాలకు కళాభిమానులు తరలిరావాలని గోదావరి కళా సంఘాల సమాఖ్య అధ్యక్షులు కనకం రమణయ్య పిలుపునిచ్చారు. ఈమేరకు గోదావరిఖనిలోని ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయం ఆవరణలో గల స్ఫూర్తి భవన్ లో కళా సంఘాల సభ్యులతో శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కళోత్సవాలకు సంబంధించి వాల్ పోస్టర్ అవిష్కరించారు.ఈనెల 17న స్థానిక ఆర్ సీ ఓ ఏ క్లబ్ లో అంగరంగ వైభవంగా కళోత్సవాలకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ అధికారులు, కళాకారులు, ప్రముఖులు, రామగుండం శాసన సభ్యులు అతిథులుగా హాజరవుతున్నట్లు తెలిపారు. కళా సంఘాల సమాఖ్య 37వ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని జరిగే ఈ వేడుకల్లో కళాకారులు వివిధ కళారూపాలు ప్రదర్శనలు ఇవ్వనున్నట్లు తెలిపారు.కళలకు, కళాకారులకు పుట్టినిల్లుగా ఉన్న కార్మిక క్షేత్రం వైభవం చాటేలా 17న కళోత్సవాలు మరింత అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు బొంకూరి మధు, రేణిగుంట రాజమౌళి, రాశిపాక రాజమౌళి, మేదరి వాసు, వెంకటరాజం. సోగాల వెంకటి, అంజయ్య, లక్ష్మణ్, దేవేందర్, నాగుల శ్రీనివాస్, మొండయ్య, నాగరాజు, సురేశ్, సందీప్, గీత. లలిత పాల్గొన్నారు.

# పెద్దపల్లి మండల పంచాయతీ ఇంచార్జీ అధికారిగా జనగామ శరత్ బాబు



**పెద్దపల్లి -నవభూమి:** పెద్దపల్లి మడల ఇంచార్జి మండల పంచాయతీ అధికారిగా మండలంలోని నిట్టూరు గ్రామ పంచాయతీ కార్యదర్శి జనగామ శరత్ బాబు విధులు నిర్వహించనున్నారు. ప్రస్తుత ఎంపీవో ఎండీ ఫయాజ్ అలీ హాజ్ యాత్రకు వెళ్తున్న సందర్భంలో సెలవుపై వెళ్తున్నారు. దీంతో మండల అభివృద్ధిని పర్యవేక్షించేందుకుగాను ఆయన స్థానంలో నిట్టూరు గ్రామ పంచాయతీ కార్యదర్శి శరత్ బాబుకు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ పంచాయతీరాజ్ కమీషనర్ ఉత్తర్వులు జారీ చేశారని, అట్టి ఆదేశాలతో జూన్ 30 వరకు ఇంచార్జి ఎంపీవోగా శరత్ బాబు బాధ్యతలు నిర్వహిస్థారని ఎంపీడీవో కొప్పుల శ్రీనివాస్ తెలిపారు.

# అకాల వర్షంతో ధర్మారం మార్కెట్ యార్డులో తడిసిన వరి ధాన్యం

**ధర్మారం, -నవభూమి:** పెద్దపల్లి జిల్లా ధర్మారం మండల కేంద్రంలో శనివారం అకాల వర్షం కురవడంతో రైతుల వరి ధాన్యం తడిసి నష్టం వాటిల్లింది. వాన సుమారు 20 నిమిషాల పాటు ఏకధాటిగా అకస్మాత్తుగా కురిసింది. దీంతో స్థానిక మార్కెట్ యార్డులో రైతులు పోసిన వరి ధాన్యం తడిసింది. రైతులు తమ పంట పొలాల నుంచి పోసిన వరి ధాన్యం ను ట్రాక్టర్లలో తీసుకువచ్చి మార్కెట్ యార్డు ఆవరణలో ఆరబెట్టారు.త్వరగా తేమ రావడం కోసం రైతులు వరి ధాన్యంపై టార్పాలిన్ కవర్లు కప్పకుండా ఎండ పోశారు. అయితే మధ్యాహ్నం సమయంలో అకస్మాత్తుగా ఆకాశం మేఘావృతమై అకాల వర్షం కురిసింది. దీంతో ఆరబెట్టిన వరిదాన్యం తడిసి నష్టం వాటిల్లినట్లు రైతులు తెలిపారు. మార్కెట్ యార్డు ఆవరణ ఏటవాలుగా ఉండడంతో వరద నీరు పోవడంతో కొందరి రైతుల వరి ధాన్యం కొట్టుకొని మార్కెట్ గేటు దాటిపోయింది. దీంతో రైతులు కొట్టుక పోయిన ధాన్యాన్ని కుప్ప చేయడానికి నాన తండాలు పడ్డారు. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొని తమకు న్యాయం చేయాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.రైతుల తడిసిన ధాన్యం గురించి జిల్లా మార్కెటింగ్ అధికారులకు, స్థానిక ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కు సమాచారం అందజేస్తానని ఏఎంసీ చైర్మన్ రూప నాయక్ తెలిపారు .

# సెర్ప్ ఉద్యోగుల నిరీక్షణ ఫలించేనా..?

**కరీంనగర్ -నవభూమి:** గత కొద్దినెలల నుంచి బదిలీల కోసం వేచి చూస్తున్న గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఉద్యోగుల నిరీక్షణ ఫలించేనా? అనే అనుమానాలు వెల్లువెత్తుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం అన్ని ప్రభుత్వ శాఖల్లో బదిలీలు జరిగినా, సెర్ఫ్ లో మాత్రం చేపట్టలేదు. అయితే తమకు కూడా బదిలీ అవుతుందని ఆయా విభాగాల్లో పనిచేసే అధికారులు, ఉద్యోగులు ఆశపడ్డారు. డీఆర్డీఏ అధికారులు కసరత్తు కూడా చేపట్టారు. అయితే ప్రభుత్వం వారి బదిలీలకు నాడు అవకాశమివ్వలేదు.అప్పటి నుంచి వారు మంత్రి సీతక్కతో పాటు ఆ శాఖ ఉన్నతాధికారులకు విన్నవిస్తూనే ఉన్నారు. అయినా పట్టించుకోక పోవటంతో పలుమార్లు రోడ్డెక్కారు. దీంతో స్పందించిన ప్రభుత్వం ఎట్టకేలకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లోని సెర్ఫ్ ఉద్యోగుల బదిలీకి అవకాశమిస్తూ, రెండు రోజుల క్రితం ఉత్తర్వులు విడుదల చేసింది. కానీ, మార్గదర్శకాలు మాత్రం ఇప్పటివరకు ప్రకటించకపోగా, ఈ నెలాఖరులోపు బదిలీల ప్రక్రియ ఎలా చేపడతారనే ఉత్కంఠ ఉద్యోగుల్లో నెలకొంది.కాగా, డిఆర్డీవో మినహా అన్ని కేటగిరీలకు చెందిన వారికి ఈసారి వంద శాతం స్థానచలనం ఖాయమంటూ ప్రభుత్వ ఉత్తర్వుల్లో పేర్కొనటంతో, మూడేళ్లకు మించి ఒకేచోట కొనసాగుతున్న ఉమ్మడి జిల్లాలోని కొంత మంది డిపిఎం స్థాయి ఉద్యోగులు ప్రస్తుతమున్న స్థానం నుంచి కదలకుండా ఉండేందుకు కారణాలు వెదుకుతున్నట్లు తెలుస్తున్నది. ఇతర జిల్లాల్లో పనిచేసే వారు సొంత జిల్లాకు వస్తామనే ఆశతో ఉండగా, ఆశాఖలో ఇప్పటినుంచే మొదలైన పైరవీలు వారి ఆశలకు గండి కొట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి.అసమంజసంగా ఉత్తర్వులు..సెర్ఫ్ ఉద్యోగుల బదిలీలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన ప్రభుత్వం, ఉత్తర్వుల్లో పేర్కొన్న బదిలీకి అనుసరించే విధానాలపై కిందిస్థాయి ఉద్యోగులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ పరిధిలో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం వేర్వేరు విభాగాలుగా పనిచేస్తున్నాయి. ఈ రెండింటిలో కొనసాగుతున్న ఉద్యోగులు వాటి పరిధిలోనే విధులు



నిర్వహిస్తున్నారు.ప్రస్తుతము సెర్ఫ్ లో మాత్రమే బదిలీలు చేపట్టేందుకు ప్రభుత్వం నిర్ణయించగా, ఇందులో జిల్లా స్థాయిలో ఏపీడీలు, డీపీఎంలు, ఏపీవో, సిసీలు, ఎంఎస్ సీసీలు, అడ్మినిస్ట్రేషన్, ఆఫీస్ అసిస్టెంట్లు విధులు నిర్వహిస్తున్నారు. వీరిలో మొదటి రెండు కేడర్ల పోస్టులు రాష్ట్రస్థాయిలో, ఏపీఎం కేడర్ పోస్టులు జోనల్ స్థాయిలో, సీసీలకు జిల్లాస్థాయిలో బదిలీలు నిర్వహించాల్సి ఉంటుంది. అయితే, సీనియర్ అసిస్టెంట్ తో సమానమైన ఏపీఎం కేటగిరి పోస్టులను మల్టీ జోన్ పరిధిలో చేర్చుతూ ఉత్తర్వుల్లో పేర్కొనడం పట్ల ఏపీఎంలు మండిపడుతున్నారు. జోనల్ పోస్టుకు సంబంధించిన వీరు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో బదిలీలు జరిగితే, ఉమ్మడి జిల్లాలో కాకుండా ఇతర ఉమ్మడి జిల్లాలను ఎంపిక చేసుకోవాల్సి ఉంటుంది.దీంతో, ఈ బదిలీలు తమకు కొత్త సమస్యలు తెచ్చి పెట్టబోతున్నాయనే ఆందోళన వారిలో వ్యక్తమవుతున్నది. జిల్లాలోని గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థలో ప్రస్తుతం ఒక అదనపు డీఆర్డివో పోస్టు, 5 డీపీఎం, 19 ఏపీఎం, 63 సీసీ, 5 ఎమ్మెస్సీసి, అడ్మినిస్ట్రేషన్ అసిస్టెంట్ పోస్టులు 5, ఆఫీస్ అసిస్టెంట్ పోస్టులు 4 ఉన్నాయి. ఈ పోస్టుల్లో కొనసాగుతున్న వారందరికీ బదిలీ అవకాశం ఉంటుందని డీఆర్డిఏ వర్గాలు పేర్కొంటున్నాయి.